

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471


తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number
9059328777



రంగారెడ్డి శుక్రవారం 14-08-2026 సంపుటి: 02 సంచిక : 104 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Friday, 14-08-2026 Volume :02 Issue: 104 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## మంత్రి తుమ్మల

# రికార్డు

రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం




- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21 సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ
- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం
- 4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం
- ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవల

హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం.

-మిగతా 2 లో



## చీకట్లో బంగ్లాదేశ్..

- తీవ్ర విద్యుత్ సంక్షోభంలో దేశం..
- రోజుకు 10 గంటల వరకు విద్యుత్ కోతలు
- చమురు కొరతతో తగ్గిన విద్యుత్ ఉత్పత్తి
- డీజిల్ సరఫరా కోసం భారత్‌కు ఢాకా విజ్ఞప్తి
- ప్రజల ఆగ్రహం.. పరిశ్రమలు, రైతులపై తీవ్ర ప్రభావం
- సాయం చేయాలంటూ ఇండియాకు వినతి

న్యూఢిల్లీ

కొద్ది రోజులుగా బంగ్లాదేశ్ చీకట్లో మగ్గుతోంది. దేశం ఎప్పుడూ లేని విధంగా, తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏకంగా 9-10 గంటల విద్యుత్ కోతలు నమోదవుతున్నాయి. తారిక్ రహమాన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఈ విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోతోంది. చివరకు భారత్ సాయం కావాలని కోరింది. గతంలో ఎప్పుడూ లేని విద్యుత్ సంక్షోభాన్ని ప్రస్తుతం బంగ్లాదేశ్ ఎదుర్కుంటోంది. తగినంత విద్యుత్ సరఫరా చేయలేకపోవడంతో దేశమంతా భారీ విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 10 గంటల వరకు కోతలు

-మిగతా 2 లో




## అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

- హైవేల్లో 10 కి.మీ పరిధిలో 10 నిమిషాల్లో చేరుకోవాలి
- ప్రమాదాల్లో జాప్యం నివారణకు ఎన్‌హెచ్ఏఐ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ

జాతీయ రహదారులపై ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనలో జరిగే ఆలస్యాన్ని నివారించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) 10 నిమిషాల డెడ్‌లైన్‌ను తీసుకొచ్చింది. 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రమాదస్థలికి 10 నిమిషాల్లోపు అంబులెన్స్ చేరుకోవాలని బుధవారం విడుదల చేసిన తన విధాన మార్గ దర్శకాల్లో పేర్కొంది. ఇలా చేరుకోని పక్షంలో ప్రతి ఘటనలో రూ.10 వేలు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రమాదాల్లో సహాయ టికెట్ అభ్యర్థనను ఆమోదించినప్పటి నుంచి గంట లోపు

-మిగతా 2 లో



# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
- చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
- ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
- రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
- లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
- 'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
- పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం

02

### ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!

ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ద్వారా అందించే సమాచారం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్యాకెట్లపై అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు వంటి అంశాలను స్పష్టంగా తెలియజేసే విధానాన్ని అమలు చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, వినియోగదారులకు ముఖ్యంగా పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.



## నాపైనే కుల వివక్ష

- హల్ద్వానీ ఘటనతో అవమానానికి గురయ్యానన్న ఖర్గే
- ప్రసంగించిన ప్రదేశంలో శుద్ధీకరణపై తీవ్ర అభ్యంతరం
- 'ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి' అంటూ రాజ్యసభలో ఆవేదన
- అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్
- ఘటనపై విచారణ జరిపిస్తామని కేంద్రం హామీ

న్యూఢిల్లీ

బీజేపీ పాలనలో దళితులకు సరైన గౌరవం దక్కదని మరోసారి రుజువైంది. ఈ అనుభవం సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఎదురైంది. రాజ్యసభ ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గేకు ఉత్తరా ఖండ్‌లో తీవ్ర అవమానం జరిగింది. ఈనెల 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ లో ఖర్గే ఒక బహిరంగసభలో ప్రసంగించిన

-మిగతా 2 లో



## భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

- రాయదుర్గంలో హెరిటేజ్ భూముల విక్రయాన్ని ఉపసంహరించాలి
- వేలంపాటలో కొనుగోలు చేస్తే న్యాయపరమైన సమస్యలు తప్పవు
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్

ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు ప్రశ్నించారు. నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు ఇచ్చి ఇప్పుడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన బహిరంగలేఖ రాశారు. గతంలో కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఇప్పుడు రాయదుర్గం ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. రాయదుర్గం పన్మక్త గ్రామంలోని సర్వే నెంబర్ 83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఈనెల 17, 21 తేదీల్లో టీజీఐఐసీ వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని

-మిగతా 2 లో

## 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్‌కు

# శ్రీకారం

కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని శ్రీధర్‌బాబుకు సీఎం ఆదేశం

### మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం

- పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మా పాలనను బేరీజు వేయాలని పిలుపు
- గల్లీ నుంచి ఢిల్లీకి పంపిన కూకట్‌పల్లి ప్రజలకు సీఎం కృతజ్ఞతలు
- సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వ్యాఖ్య
- 22ఏ అంశంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా
- తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి


హైదరాబాద్

కూకట్ పల్లి లో "ఇందిరమ్మ ఇండ్లు" టవర్స్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని, కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి అని సీఎం పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు ని ఆదేశించారు. పదేళ్ల వారి పరిపాలన

-మిగతా 2 లో







80వ స్వాతంత్ర్య వేడుకలు..

## ముస్తాబైన ఎర్రకోట

- 80వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వాంగ సుందరంగా ఎర్రకోట
- ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న ప్రధాని మోదీ
- 'వందేమాతరం-150', 'వికసిత్ భారత్@2047' ప్రధాన థీమ్‌లు
- వందేమాతరం ఆకృతిలో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, వాలంటీర్లు
- 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఘనంగా వేడుకలు
- భద్రత, రవాణా, పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి

02

## భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



02

- బలం పుంజుకున్న రుతుపవనాలు
- అల్పపీడన ప్రభావంతో చురుగ్గా మారిన రుతుపవనాలు
- దేశవ్యాప్తంగా విస్తరించిన దట్టమైన మేఘావరణం
- ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టమైన వర్షపు మేఘాల కదలిక
- పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ఒడిశా, పశ్చిమ బెంగాల్‌పై అల్పపీడన ప్రభావం

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం



02

- వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
- 11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం
- నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ
- మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ
- లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

-ఆహార ప్యాకెట్లపై హెచ్చరికలు తప్పనిసరి!
-కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక
-చక్కెర, ఉప్పు, కొవ్వు వివరాలు స్పష్టంగా చూపించాలి
-ప్రజల ఆరోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలా?
-రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం
-వినియోగదారులకు తెలుసుకునే హక్కు ఉందన్న ధర్మాసనం
-లేబుళ్ల అమలులో జాప్యంపై అసంతృప్తి
-'మీరు చేయకపోతే మేమే చేస్తాం'
-పిల్లల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న కోర్టు
-ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీ
అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

మొదటి తరువాయి

తెలిపారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ కోర్టు మెట్లు ఎక్కిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అదే భూమిపై థర్డ్ పార్టీ హక్కులు సృష్టించేలా వేలానికి ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాటనా? అని పేర్కొన్నారు. జీవో నెంబర్ నాలుగు, సర్వే నెంబర్ 83ను హెరిటేజ్ భూమిగా గుర్తించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని అడిగారు. సీఎం అనుయాయులకు మేలు చేసేందుకేనా? అని ప్రశ్నించారు. ఇదే సర్వే నెంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్బీఐ కోర్టుకు ఎక్కిందని గుర్తు చేశారు. దీంతో కోర్టు అంక్షితలు వేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. అయినా అదే సర్వే నెంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏంటని? ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా?అని అడిగారు. భూమిపై యాజమాన్య వివాదాలు ఈ భూమిపై యాజమాన్య వివాదాలు ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. హెరిటేజ్ అంశం, వక్ఫ్ హక్కుల అంశం కూడా ఉన్నాయని వివరించారు. అనేక కోర్టు వివాదాలున్నాయని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకని ప్రశ్నించారు. రూ.రెండు వేల కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారని అడిగారు. ఈనెల 17, 21 తేదీల్లో జరగనున్న టీజీఐఐసీ వేలాలను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 83కి సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని సూచించారు.

## నాపైనే కుల వివక్ష

మొదటి తరువాయి

తర్వాత ఆ ప్రదేశం అపవిత్రమై పోయిందంటూ బీజేపీ అనుబంధ వర్గాలు శుద్ధి కార్యక్రమం నిర్వహించాయి. ఇది సోషల్ మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ వైరల్‌గా మారింది. దీంతో ఈ ఘటన తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. కాంగ్రెస్, బీజేపీల పరస్పర విమర్శలకు దారితీసింది. ఖర్గే ప్రసంగించిన ప్రాంతంలో బీజేపీతో కలిసి శ్రీరామ్ సేన శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఘటనపై ఖర్గే గురువారం రాజ్యసభలో ఆవేదనతో ప్రసంగించారు. హల్ద్వానీలో ఒక బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత ఒక అంటరానితనం తాలుకు చేదు అనుభవాన్ని తాను చవిచూడాల్సి వచ్చిందని మల్లికార్జున ఖర్గే అన్నారు. "దీనిని రాజకీయం చేద్దామని ఎప్పుడూ అనుకోలేదు. చాలా ఏండ్లుగా నేను పార్లమెంట్లో ఉన్నాను. ప్రస్తుతం రాజ్యసభలో, గతంలో దిగువ సభలో సభ్యుడిగా ఉన్నాను. ఎప్పుడూ సానుభూతిని పొందడానికి ప్రయత్నించ లేదు. నాది షెడ్యూల్డ్ కులం, నేను దళితుడినని చెప్పి సహాయం, రక్షణ కల్పించా లని ఎన్నడూ అడుగ లేదు" అని ఆయన రాజ్యసభలో తెలిపారు. "హల్ద్వానీలో నేను ప్రసంగించినప్పుడు లక్షలాది మంది ప్రజలు ఉన్నారు. నేను ఏ కులం, మతం పేరునూ ప్రస్తావించ లేదు. ప్రజల సమస్యలకు సంబంధించిన అంశా లను మాత్రమే ప్రస్తావించా. కానీ నా ప్రసంగం పూర్తయిన తర్వాత మీరు (బీజేపీ అనుబంధ సభ్యులు) శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను అవమానించడానికి ప్రయత్నించారు. అస్పృశ్యత తాలుకు బాధను మీరు అనుభవం లోకి తెచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇదేం పద్ధతి? రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారు? నేను ప్రతిపక్ష నాయకుడిని. పోరాటం చేసే శక్తి ఉంది. పోరాడుతాను" అని వివరించారు. వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, అలాంటి చర్యలను బీజేపీ ఎంతమాత్రమూ ప్రోత్సహించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. దీనిపై దర్యాప్తు చేయిస్తామని ఆయన హామీనిచ్చారు.

## అంబులెన్స్ ఆలస్యమైతే 10 వేల జరిమానా!

మొదటి తరువాయి

దగ్గరలోని దవాఖానకు బాధితులను చేర్చాలని సూచించింది. దీన్ని ఉల్లంఘించిన వారికి రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశముందని చెప్పింది. 10 కిలోమీటర్ల పరిధి దాటిన ప్రమాదాల్లో అంబులెన్స్ చేరుకోవాల్సిన సమయం దామాషా ప్రకారం పెరుగుతుందని.. ఇది జీపీఎస్ డేటా/ఐఎమ్ఎస్ కేర్ డ్యాష్ బోర్డ్ ద్వారా ధ్రువీకరణ అవుతుందని స్పష్టం చేసింది. ఎమర్జెన్సీ టికెట్‌ను తిరస్కరిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తామని వెల్లడించింది. ఒప్పందాల్లో భాగంగా పరికరాలు, మందులు, సిబ్బందిని సమకూర్చని సంస్థలకు రూ.10 వేల జరిమానా వేస్తామని తెలియజేసింది. తాజా మార్గదర్శకాలను ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్రాంతీయ అధికారులు కట్టదిట్టంగా అమలు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే జాతీయ రహదారులపై వివిధ సేవల కోసం 1033 హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఎన్‌హెచ్ఏఐ నిర్వహిస్తున్నది.

# 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్‌కు శ్రీకారం

మొదటి తరువాయి

రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి అని సీఎం అన్నారు. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామన్నారు. ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, స్వయం సహాయక సంఘాలకు రూ. 65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని అన్నారు. కడుపులో విషం పెట్టుకుని అట్ డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా వెనక్కి తగ్గేదేదని బిఆర్ఎస్ సుద్దేసించి అన్నారు. ఆడ బిడ్డలను బస్సులకు యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించేందుకుడు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చామన్నారు. ఒకవైపు గత



ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. డబ్బా ఇండ్ల వద్ద డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు, పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టిందని, మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటా నని సీఎం అన్నారు. 22 ఎ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో మీకు ఆందోళన అవసరం లేదని, సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు అని సీఎం అన్నారు. పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మీ తమ్ముడి పాలనను బేరీజు వేసుకోండి అని కోరారు. నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది.. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని అన్నారు. కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరువు రావాలని క్షుద్ర పూజలు చేశారనీ, అయినా దేవుడు మన వైపు ఉన్నాడనీ.. వర్షాలు కురిపించాడనీ తెలిపారు. మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉందన్నారు. కుటిల బుద్ధితో క్షుద్ర పూజలు చేసే వారికి అది తిరిగి వారినే అష్ట దిగ్బంధనం చేస్తుందని విమర్శించారు. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలు.. ముస్తాబైన ఎర్రకోట


న్యూఢిల్లీ
దేశ రాజధాని ఢిల్లీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆగస్టు 15న ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు', 'వికసిత్ భారత్ఏ2047 కోసం యువశక్తి' అనే ప్రధాన థీమ్‌లతో నిర్వహించనున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గీతం ప్రాధాన్యాన్ని గుర్తుచేయడంతో పాటు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువత పాత్రను చాటిచెప్పేలా కార్యక్రమాలను రూపొందించారు. జ్ఞానపథ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలు ఈసారి వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సుమారు 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వాలంటీర్లు వందేమాతరం ఆకృతిలో కూర్చోనున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 5 వేల మంది ప్రత్యేక ఆహ్వానితులు ఎర్రకోటలో జరిగే వేడుకలను ప్రత్యక్షంగా



వీక్షించనున్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా వీరిని ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. వేడుకలకు వచ్చే ఆహ్వానితులు, సందర్శకుల సౌకర్యార్థం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెట్రో ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సంప్రదాయ ఆహ్వాన పత్రికలకు బదులుగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఈ-ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే వారికి ప్రవేశ ప్రక్రియ సులభతరం కానుంది. మరోవైపు ఎర్రకోట పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, అతిథుల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. భారీ సంఖ్యలో ప్రజలు, ఆహ్వానితులు హాజరుకానున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేడుకలు ముగిసిన వెంటనే ఎర్రకోట పరిసరాల్లో 'స్వచ్ఛత ప్రచారం' చేపట్టనున్నారు. చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. మొత్తంగా జాతీయ స్ఫూర్తి, వందేమాతరం వారసత్వం, యువశక్తి, అభివృద్ధి లక్ష్యాలను ప్రతిబింబించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## పార్లమెంటులో 12 బిల్లులు ఆమోదం

-వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
-11 బిల్లులు చర్చ లేకుండానే లోక్‌సభలో ఆమోదం
-నీట్ అవకతవకల బిల్లుపైనే ఉభయ సభల్లో విస్తృత చర్చ
-మోడీ, షా వైఖరితో స్తంభించిన సభలంటూ ప్రతిపక్షాల విమర్శ
-లోక్‌సభ ఉత్పాదకత 19%, రాజ్యసభ 39%గా నమోదు




న్యూఢిల్లీ బ్యూరో
జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ 12 బిల్లులను ఆమోదించింది. వీటిలో ఒక బిల్లుపై మాత్రమే ఉభయ సభలలో కూలంకషంగా చర్చ జరిగింది. నీట్ లీక్ తరువాత విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రవేశపెట్టిన 'పబ్లిక్ పరీక్షల అవకతవకల నివారణ (సవరణ) బిల్లు'పై లోక్‌సభలో 10 గంటల 54 నిమిషాలు, రాజ్యసభలో 6 గంటల 39 నిమిషాలు చర్చ జరిగింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ చర్చకు వచ్చిన ఏకైక బిల్లు ఇదే. ఈ బిల్లు మినహా, మరే ఇతర బిల్లుపైనా ఏ సభలోనూ కూలంకషంగా చర్చ జరగలేదు. లోక్‌సభ 11 బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించింది. ఈ బిల్లులలో తొమ్మిదింటిపై సంబంధిత మంత్రులు మాత్రమే మాట్లాడారు. ?కీలకమైన అంశాలపై వివరణలు ఇవ్వని కేంద్ర ప్రభుత్వ దుస్సాహసానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉభయ సభలలో తీవ్రంగా నిరసన తెలుపుతుండగా... కేంద్ర ప్రభుత్వం మాత్రం చర్చ లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదించడంలో నిమగ్నమైంది. 'మ్యాగీ నూడుల్స్ తయారు చేసినంత సులభంగా' కేంద్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదిస్తుందన్న తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓ'బ్రియన్ విమర్శను వర్షాకాల సమావేశాల గణాంకాలు కూడా ధృవీకరిస్తున్నాయి. 1969 జనన, మరణాల నమోదు చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన ముఖ్యమైన బిల్లుపై లోక్‌సభలో ఎలాంటి చర్చా జరగలేదు. మరోవైపు, రాజ్యసభలో కేవలం 50 నిమిషాలు మాత్రమే చర్చ జరిగింది. ప్రతి ఎంపీకి కేటాయించిన సగటు సమయం మూడు నిమిషాలు మాత్రమే. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సీఆర్ఏ)ను అధ్యయనం, నివేదిక కోసం సంయుక్త సభా సంఘాని (జేపీసీ)కి నివేదించారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సామర్థ్యం 19 శాతంగా, రాజ్యసభ సామర్థ్యం 39 శాతంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అనవసరమైన ప్రతిపక్ష నిరసనలు ఉభయ సభల సామర్థ్యాన్ని దెబ్బతీశాయని కూడా మంత్రి ఆరోపించారు. అయితే, కీలకమైన అంశాలపై వివరణ ఇవ్వడానికి, చర్చలు జరపడానికి సిద్ధంగా లేని కేంద్ర ప్రభుత్వం, వర్షాకాల సమావేశాలను నిరసనల సముద్రంలో ముంచివేసిందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. ?ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత, 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన నిరసనల కారణంగా వర్షాకాల సమావేశాలు పూర్తిగా రద్దయ్యాయి. లోక్‌సభ తనకు కేటాయించిన సమయంలో కేవలం 15 శాతం, రాజ్యసభ 18 శాతం మాత్రమే పనిచేశాయి. 2018 బడ్జెట్ సమావేశం, 2021 వర్షాకాల సమావేశం, 2023 బడ్జెట్ సమావేశాలు కూడా భారీ నిరసనలతో దెబ్బతిన్నాయి.

## చీకట్లో బంగ్లాదేశ్..

మొదటి తరువాయి

అమలవుతున్నాయి.దేశంలో 18,000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ఉత్పత్తి మాత్రం 13,000 వాట్లకు తక్కువగానే ఉంది. అసలే, అక్కడి ప్రజలు ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతలతో అల్లాడతున్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలో స్థానిక విద్యుత్ పంపిణీ కేంద్రాలైన పవర్ స్టేషన్లపై, అధికారులపై ప్రజలు దాడులు చేస్తున్నారు. దీంతో పవర్ స్టేషన్ల వద్ద రక్షణ కల్పించాల్సిందిగా పోలీసుల్ని ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ కోతను ఎదుర్కొనేందుకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా తగ్గించివేసింది. అలాగే, రాజధాని ఢాకాతోపాటు అనేక నగరాల్లో షాపులు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్ అన్నీ రాత్రి 8.00 గంటలకే మూసేయాలని ఆదేశించింది. రైతులు కూడా తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రైతులు, వ్యాపార సంస్థల యజమానులు, పరిశ్రమలు విద్యుత్ కొరత ప్రభావానికి గురవుతున్నాయి. ఈ విద్యుత్ సంక్షోభానికి కారణం చమురు కొరత. తగినంత చమురు లేకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతోంది. బంగ్లాదేశ్ 90 శాతం చమురును, 30 శాతం గ్యాస్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అయితే, విదేశాల నుంచి తగినంత చమురు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో సాయం చేయాల్సిందిగా ఇండియాను బంగ్లాదేశ్ కోరింది.

## భారత్‌ను కప్పేసిన నైరుతి మేఘాలు



న్యూఢిల్లీ:
భారతదేశం మీద దట్టమైన నైరుతి వర్షపు మేఘాలు కమ్ముకున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. రుతుపవనాలు మళ్లీ బలం పుంజుకుంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త అల్పపీడన వ్యవస్థ తూర్పు, మధ్య భారత ప్రాంతాల వాతావరణాన్ని ప్రభావితం చేస్తోంది. దీని వల్ల దేశంలోని విస్తార ప్రాంతాలు మందపాటి మేఘాల కింద ఉన్నాయని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టు 13న యూమెట్ శాట్, ఇస్రో ఇన్సాట్ ఉపగ్రహాలు తీసిన చిత్రాల్లో అరేబియా సముద్రం నుంచి మధ్య భారతదేశం, గంగా మైదానాలు, ఈశాన్య ప్రాంతాల వరకు విస్తరించిన విస్తృత మేఘావరణం కనిపిస్తోంది. ఉత్తర బంగాళాఖాతం, తూర్పు భారతదేశం, బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రమైన మేఘ సమూహాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఇక్కడ కొత్తగా ఏర్పడిన అల్పపీడన ప్రాంతం తేమను లోతట్టు ప్రాంతాల్లోకి లాగుతోంది. భారత వాతావరణ శాఖ ప్రకారం పశ్చిమ బెంగాల్ – బంగ్లాదేశ్ తీరం వద్ద ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. ఈ వ్యవస్థ లోతట్టు ప్రాంతాల్లోకి కదులుతూ ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పరిసర రాష్ట్రాల్లో విస్తృత వర్షపాతం కొనసాగే అవకాశం ఉంది. ఉపగ్రహ చిత్రాల్లో తూర్పు భారతదేశంపై లోతైన సంవాహన మేఘాలు, చల్లని మేఘ శిఖరాలు కనిపిస్తున్నాయి. ఇవి తీవ్రమైన ఉరుములు, భారీ వర్షాలకు సంకేతాలు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ ఈశాన్య ప్రాంతాల్లో కూడా పెద్ద మేఘ రాశులు కనిపిస్తున్నాయి. దీని వల్ల రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుకుగా ఉందని స్పష్టమవుతోంది. వాతావరణ అధికారులు అనేక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒడిశా ప్రత్యేక దృష్టిలో ఉంది.

## మంత్రి తుమ్మల రికార్డు

మొదటి తరువాయి

ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20 సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వ సారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది.
వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

20 సార్లు జెండా ఆవిష్కరణ.. ఇప్పుడు 21వ సారి

1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వ సారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

# తిరంగా ర్యాలీలో పాల్గొన్న తల్లోజు ఆచారి





● ఆమనగల్లులో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ
● మువ్వన్నెల జెండాలతో కదంతొక్కిన వేలాది మంది విద్యార్థులు, యువత
● దేశ ఐక్యత, సమగ్రతకు త్రివర్ణ పతాకం ప్రతీక

**ఆమనగల్లు, ఆగస్టు 13(నేటి దర్శిని);**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.చౌరస్తా నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. వేలాది మంది విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీజేవైఎం, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు చేతుల్లో మువ్వన్నెల జెండాలు పట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో ఆమనగల్లు పురవీధులు మార్మోగాయి. భారీ సంఖ్యలో విద్యార్థులు త్రివర్ణ పతాకాల తో పాల్గొనడంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

**దేశ ఐక్యతకు త్రివర్ణ పతాకం ప్రతీక: ఆచారి**
ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. మువ్వన్నెల జెండా దేశ గౌరవం, స్వాతంత్ర్యం, ఐక్యత, సమగ్రతకు ప్రతీక అని పేర్కొన్నారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని కోరారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు భారతదేశ చరిత్రను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, రాజ్యాంగ విలువలను తెలుసుకుని జాతీయ భావంతో ముందుకు సాగాలని సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆచారి అన్నారు. దేశ ప్రగతిలో సైనికులు, రైతులు, శాస్త్రవేత్తలు, యువతతో పాటు ప్రతి భారతీయుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని, దేశం పట్ల మనకున్న గౌరవం, బాధ్యత, దేశభక్తిని చాటే గొప్ప కార్యక్రమమని తల్లోజు ఆచారి అన్నారు. దేశ ప్రగతి, జాతీయ భావనను మరింత విస్తృతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.
భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహా, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెక్కల లక్ష్మణ్, మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, కృష్ణా నాయక్, బండెల రామచంద్రారెడ్డి, పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్, అసెంబ్లీ బీజేవైఎం ఇన్‌చార్జ్ పద్మ అనిల్, మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు గోరటి భరత్, కల్వకుర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, బీసీ మోర్చా అధ్యక్షుడు బన్నె నరసింహా, ఆచారి మిత్రమండలి అధ్యక్షుడు మట్ట పరమేష్, నాటు శివ, సిరి శ్రీశైలం, లండ0 మల్లేష్, సుమన్ నాయక్, బాలు నాయక్, వెంకట్ నాయక్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు, యువజన మోర్చా నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతం చేశారు.

# తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థను తనిఖీ

● జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్





**మిడ్జిల్, ఆగస్టు 13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
దేవరకద్ర మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ( టీ.జీ.ఎస్.డబ్ల్యూ ఆర్.ఎస్.) జూనియర్ కళాశాల, హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు. ఈ తనిఖీలో దేవరకద్ర ఎం.పి.ఓ, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజా సమస్యలు తెలుసుకొని ఇబ్బందులు లేకుండాచూడాలి: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు




**ఉమ్మడి వరంగల్ ఆగస్టు 13 (నేటి దర్శిని బ్యూరో):**
అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు.గురువారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ లోని పలు కాలనీలో ఉన్న సమస్యలపై వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న,అధికారులతో కాలనీల ప్రెసిడెంట్ లతో మున్సిపాలిటీ కాన్ఫరెన్స్ హాలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. కాలనీలలో తాగునీటి సమస్య ఎదురవుతుందని అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యక్తంగా ఉందని, కాలనీ వాసుల వివరించిన సమస్యలను పరిష్కరించి అధికారులను చర్యలు తీసుకోవాలని సూచించారు.కాలనీలలో అవసరమైన చోట్ల వీధిలైట్లు,స్మశాన వాటికల వద్ద నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.అధికారులు, వివిధ శాఖలతో అధికారులతో కలిసి ఒకరికోకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షులు ఇంతియాజ్, కాలనీలాల అధ్యక్షులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి



● జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి



**ఆమనగల్లు, ఆగస్టు13 (నేటి దర్శిని);**
ఆమనగల్లు పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఆమనగల్లు బస్టాండ్ ప్రక్కనున్న యూపీఎస్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ కిరణ్మయి, మెప్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులకు దుస్తులు అందజేసిన అనంతరం వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో కీలకమని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తదుపరి ఆమనగల్లు సూర సముద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. చెరువులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ, నీటిమట్టం, పరిసర ప్రాంతాల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.సుర సముద్రం చెరువులో నీటిమట్టం తగ్గకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.నీటి లీకేజీలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెరువు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న "అమృత్ జల్" మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని,నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ట్యాంకు నిర్మాణం పూర్తయిన అనంతరం పట్టణంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందేలా నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్ పర్సన్ గీత, మేనేజర్ ఆంజనేయులు, రామకృష్ణ, షర్ఫుద్దీన్, మహబూబ్, ఇతరఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పనులు వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్





**మిడ్జిల్, ఆగస్టు 13 (నేటి దర్శిని, మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) కొనసాగుతున్న సివిల్ పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో కేజీబీవీల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పాటించాలని స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత సమయంలోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా కేజీబీవీల్లో చేపట్టిన పనులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి పనులను పరిశీలించిన డీసీహెచ్ఎస్


● జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త అనురాగిణి రెడ్డి



**ఆమనగల్లు, ఆగస్టు13(నేటి దర్శిని):**
ఆమనగల్లు నూతన 50 పడకల్ ప్రభుత్వ ఆసుపత్రిని రంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్ అనురాగిణి పరిశీలించారు.డీఈ కోటేశ్వరరావు తో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులు, మౌలిక వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి భవన నిర్మాణ పురోగతి, అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను, సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ,త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆమనగల్లు పరిసర ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యులు,సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, రోగులకు అందించాల్సిన సేవలపై కూడా ఆమె ఆరా తీశారు.సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్ర కృష్ణ,అపర్ణ, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కిటిక్ సముద్రంలోని ఎన్ఎస్ఆర్
# రూటుపై భారత్ ఆసక్తి


న్యూఢిల్లీ ఆగస్టు 13 (నేటి దర్శిని)
ఆర్కిటిక్ సముద్ర మార్గానికి సంబంధించిన నార్తర్న్ సీ రూట్(ఎన్ఎస్ఆర్) రూటుపై భారత్ ఆసక్తిగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో తమతో వాణిజ్యాన్ని పెంపొందించుకునేందుకు భారత్ ఆసక్తిగా ఉన్నట్లు పుతిన్ పేర్కొన్నారు. ఆర్కిటిక్ సముద్ర మార్గంలో షిప్పింగ్ కోసం చైనా, ఇండియా లాంటి దేశాలు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈశాన రష్యా భాగంలో జరుగుతున్న సైనిక విన్యాసాలను వీక్షించేందుకు జపాన్ సమీపంలో ఉన్న దీవులకు పుతిన్ వెళ్లారు. ఆర్కిటిక్ రీజియన్స్ ఫోరమ్‌లో భారత్ కీలక భాగస్వామి అన్నారు. చెన్నై నుంచి వ్లాదివోస్తోక్ కారిడార్‌ను .. ఎన్ఎస్ఆర్ రూట్‌లో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. చెన్నై-వ్లాదివోసతోక్ కారిడార్ సుమారు 10,380 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తూర్పు ఆసియా, యూరోప్ మధ్య షార్టెస్ట్ షిప్పింగ్ రూట్‌గా




ఎన్ఎస్ఆర్‌ను భావిస్తున్నారు. ఎన్ఎస్ఆర్ మార్గం ద్వారా భారత్ వ్యూహాత్మకంగా లాభం పొందే ప్రయత్నం చేస్తున్నట్లు రష్యా అంచనా వేస్తున్నది. చైనాను ఎదుర్కొనేందుకు భారత్ ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు చైనాపై రష్యా ఆధారపడుతోంది, కానీ ఇండియా-చైనా మధ్య ఇటీవల రిలేషన్ దెబ్బతిన్నది. మరో వైపు చైనాపైనే పాకిస్థాన్ కూడా ఆధారపడుతోంది. ఇటీవల చైనా, పాక్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా ప్రతిపాదిత ఎన్ఎస్ఆర్ సముద్ర మార్గానికి ఇండియా మద్దతు ఇవ్వాల్సి వస్తున్నది. అమెరికా హెచ్చరికలను పక్కనపెట్టి రష్యా వద్దే భారత్ ఇంధనం కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా, భారత్ మధ్య వైరుధ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదిత వాణిజ్య మార్గం కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయి. చెన్నై=వ్లాదివోస్తోక్ మార్గం ద్వారా ప్రయాణిస్తే 12 రోజుల్లో 5647 నాటికల్ మైళ్లను చేరుకోవచ్చు. సీ ఆఫ్ జపాన్, ఈస్ట్ చైనా సీ, సౌత్ చైనా సీ, మలాకా జలసంధి మార్గంలో నౌకలు వెళ్తాయి. అయితే గతంలో ముంబై నుంచి పీటర్స్‌బర్గ్ మధ్య సముద్రం మార్గం ఉండేది. ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం, బాల్టిక్ సముద్రం మీదుగా ప్రయాణిస్తు సుమారు 8675 నాటికల్ మైళ్ల దూరాన్ని దాటేందుకు 32 రోజుల సమయం పడుతుంది. అయితే ప్రతిపాదిత ఎన్ఎస్ఆర్ మార్గం వల్ల చాలా సమయం ఆదా అవుతుందని భారత్ భావిస్తున్నట్లు పుతిన్ తెలిపారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా కుట్ర..

న్యూఢిల్లీ ఆగస్టు 13 (నేటి దర్శిని)
ఢిల్లీ లోని ఎర్రకోట వద్ద కారులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ ' కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. AQIS ను ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తున్నది. తాలిబన్ల నుంచి AQIS కు మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తన నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దాంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు




వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు AQIS ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతావర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. AQIS తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో AQIS కు పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ముగిసిన కన్వర్ యాత్ర..

**హరిద్వార్‌లో పేరుకుపోయిన 7,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు**

న్యూఢిల్లీ ఆగస్టు 13 (నేటి దర్శిని)
ఏడాదికి సంబంధించిన కన్వర్ యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగా దాదాపు ఐదు కోట్ల మంది శివ భక్తులు దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ సందర్శించారు. అక్కడి పవిత్ర గంగా జలాల్ని తీసుకెళ్లారు. అయితే, ఈ యాత్ర సందర్భంగా హరిద్వార్‌లో భారీగా చెత్త పేరుకుపోయింది. కోట్లాది మంది భక్తుల రాకతో ఇక్కడి అనేక ప్రాంతాలు భారీ వ్యర్థాలతో నిండిపోయాయి. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం.. హరిద్వార్‌లోని గంగా నది ఘాట్‌లైన హర్ కి పూరి సహా పలు ఘాట్‌లలో భారీ వ్యర్థాలు పేరుకుపోయాయి. దాదాపు 7,000 మెట్రిక్ టన్నుల



వ్యర్థాలు పేరుకుపోయినట్లు అధికారుల అంచనా. వేలకొలది వాటర్ బాటిళ్లు, మల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, దుస్తులు, అండర్‌వేర్స్, చెప్పులు వంటివి ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. పరిసరాల్ని అపరిశుభ్రంగా, వ్యర్థాలతో నిండి, దుర్వాసన వస్తున్నాయి. మహిళలు దుస్తులు మార్చుకునే రూమ్లు కూడా చెత్తతో నిండిపోయాయి. దీంతో ఇప్పుడు ఈ వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు అక్కడి అధికారులకు సవాలుగా మారింది. వ్యర్థాలు సేకరించడం, వేరు చేయడం, పరిసరాల్ని శుభ్రం చేయడం కోసం యుద్ధప్రాతిపదికన పని చేయాల్సి వస్తోంది. వ్యర్థాల సేకరణ కోసం 1,000 మంది వరకు పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారని స్థానిక మున్సిపల్ కమిషనర్ నంద కుమార్ తెలిపారు. ఆగస్టు 12 నుంచి వ్యర్థాల తొలగింపు కొనసాగుతోందని, ఆగస్టు 18 వరకు సాగుతుందని వెల్లడించారు. వ్యర్థాల సేకరణ, రవాణా కోసం 80 వాహనాల్ని వినియోగిస్తున్నామని వివరించారు. ఈ వ్యవహారం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ల ద్వారా వ్యర్థాల్ని గుర్తించి, తొలగిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కార్యకర్తలు కూడా ఇందులో భాగస్వాములయ్యారు.

## నా మాటకు విలువ లేదు..
# అందుకే పార్టీ మారా..!

న్యూఢిల్లీ ఆగస్టు 13 (నేటి దర్శిని)
ఆమ్ ఆద్మీ పార్టీ లో తన మాటకు విలువ లేకపోవడంతోనే బీజేపీ లో చేరినట్లు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని, తన సూచనలు పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో హర్భజన్ తాజాగా వివరణ ఇచ్చారు. రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టంచేశా' అని చెప్పారు. పంజాబ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్‌లో చేరానని అన్నారు. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదని, కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడేవాడిని కాదని హర్భజన్



చెప్పారు. పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. 'నేను ఎవరిని మోసం చేశాను..? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను' అని అన్నారు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తంచేశారు. మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

## సంపాదకీయం

## ఇరకాటంలో
# డోనాల్డ్ ట్రంప్!



మరోసారి దాడికి దిగకుండా 'జరిగింది చాలురా బాబూ' అని అమెరికా అనుకునేట్లుగా చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి తమ అదుపులోనే ఉందని డోనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటనపై టెహరాన్ స్పందన ఇది. జలసంధి మీద పూర్తి అదుపును కలిగి ఉన్నామని చెబుతూ అవసరమైతే ట్రంప్ పదవీ కాలం పూర్తయ్యే వరకు సమస్యను ఇలాగే కొనసాగిస్తామని అది హెచ్చరించింది. ఐదునెలల సంక్షోభం తరువాత అమెరికాకే హెచ్చరికలు చేసే స్థితిలో ఇరాన్ ఉండటం గమనించాల్సిన అంశం. ట్రంప్‌నకు బుద్ధి చెప్పేందుకు అసలు తామే సంక్షోభాన్ని పొడిగించేందుకు కూడా వెనుకాడబోమని ఇరాన్ ప్రభుత్వ సలహాదారు హెచ్చరించటాన్ని బట్టి అగ్రరాజ్యం ఎలా ఇరుక్కుపోయిందో అర్థమవుతున్నది. తమ షరతు లకు అంగీకరించేంత వరకు వెనక్కుతగ్గేది లేదని ఇరాన్ పదే పదే చెబుతోంది. వాషింగ్టన్ ముందుకు తెచ్చిన పదిహేను అంశాల గాజా ఒప్పందాన్ని తాము అంగీకరించేది లేదని, గాజాతో పాటు సిరియా, లెబనాన్ దేశాల నుంచి కూడా తమ సేనలు వెనక్కు రావని ఇజ్రాయిల్ కరాఖండితంగా చెప్పింది. ఇరాన్‌తో ట్రంప్ వ్యవహరించిన తీరును సమర్థిస్తామని చెబుతున్న అమెరికన్ ఓటర్లు కేవలం 24శాతం మందే అని తాజా సర్వే వెల్లడించిన పూర్వరంగంలో పరువు కాపాడు కొనేందుకు ట్రంప్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడు తున్నాడు. ట్రంప్ ఏమిచెప్పినా జలసంధిలో నౌకల రాకపోకలు ఫిబ్రవరి 28కి ముందున్న సంఖ్యతో పోలిస్తే 90తక్కువగా ఉన్నట్లు కెప్లర్ సంస్థ వెల్లడించింది. అమెరికాలో గ్యాస్ ధరలు మండుతున్నాయి, పరువు దక్కించు కొనేందుకు ట్రంప్ నష్టదాయకమైన ఒప్పం దానికి కూడా సిద్ధపడుతున్నట్లు ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. మానవహక్కుల గురించి తమకు సుభాషితాలు చెప్పవద్దని ఫ్రాన్సు నేతలకు ఇరాన్ చురకలంటింది. తమ అనుమతి లేకుండా జలసంధిలో ఏవైనా ఓడలు రాకపోకలు సాగిస్తే శత్రువులకు సరఫరా చేస్తున్నట్లుగా భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పౌర నౌకలపై దాడి అంతర్జాతీయ న్యాయసూత్రాల ఉల్లంఘన కాదా? అన్న ప్రశ్నకు యుద్ధ సమయంలో తమకు ముప్పు అని భావిస్తే వదిలేది లేదని పేర్కొన్నది. పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితి ఇలా ఉండగా రష్యా క్షిపణులను కూల్చివేసేందుకు అవసర మైన పేట్రియాట్ వ్యవస్థలను సరఫరా చేయా లంటూ ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ గగ్గోలు పెడుతున్నాడు. తమకు వ్యతిరేకంగా నాటో పన్నిన కుట్రలో భాగస్వామిగా మారిన ఉక్రెయిన్‌కు గుణపాఠం చెప్పేందుకు 2022 ఫిబ్రవరి నుంచి రష్యా సైనిక చర్య జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌పై దాడికి కేంద్రీకరించిన అమెరికా జనవరి నుంచి రష్యాతో శాంతి చర్చల గురించి అసలు మాట్లాడమే మానుకుంది. నాటో దేశాలు గత నాలుగున్నరేండ్లుగా ఎన్ని ఆధునిక ఆయుధాలు అందించినప్పటికీ మాస్కో మిలిటరీ శక్తి ముందు దిగదుడుపుగా ఉన్నాయి. వాటితో రష్యాలోని కొన్ని ప్రాంతాలపై దాడులు చేసి నష్టం కలిగించి నప్పటికీ పుతిన్ సేనల చేతిలో ఉక్రెయిన్‌కు జరుగుతున్న నష్టం అంతాఇంతా కాదు. రష్యా జరుపుతున్న క్షిపణి దాడుల వివరాలను వెల్లడించకూడదని జెలెన్‌స్కీ యంత్రాంగం నిర్ణయించిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రష్యా దాడులను ఎదుర్కోవాలంటే తమకు అమెరికా వద్ద ఉన్న పేట్రియాట్ వ్యవస్థల్లో తక్షణమే ఐదు నుంచి పదిశాతం అంద చేయాలని కోరినట్లు అతగాడు వెల్లడించాడు. ఎన్ని విన్నపాలు చేసినా లక్షల సార్లు ఫోన్లు చేసినా అమెరికా నుంచి స్పందనలేదని, కొన్ని విషయాలు బయటకు చెప్పుకోలేనని కూడా జెలెన్‌స్కీ వాపోయాడు. ఇరాన్‌పై దాడులకు ముందు అమెరికా అమ్ముల పొదిలో 2,330 పేట్రియాట్ క్షిపణి నిరోధక వ్యవస్థలుండగా ఇప్పుడు అవి 850కి పడిపోయాయన్న వార్తలను చూస్తే ఐదునెలల సంక్షోభంలో అమెరికాకు తగిలిన దెబ్బేమిటో అర్థం చేసుకోవచ్చు. ఏడాదికి కనీసం రెండువేల చొప్పున వాటిని తయారు చేయాలంటే 2029వరకు సాధ్యం కాదన్న సమాచారం గుప్పుమంది. ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ఎదుర్కొనేందుకు దక్షిణ కొరియాలో ఉన్న వాటిని కూడా గల్ఫ్ దేశాలకు తరలించింది. అలాంటిది ఉక్రెయిన్‌కు సరఫరా చేయటం కలలో మాట. ఉచితంగా వద్దు డబ్బు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వాషింగ్టన్ నుంచి ఉలుకూపలుకూ లేదు. ఒక్కొక్క వ్యవస్థ ఖర్చు 250 కోట్ల డాలర్లు, దానిద్వారా ప్రయోగించే క్షిపణి వెల కోటి డాలర్లు ఉంటుంది. మార్కెట్ లేకుండా వాటిని అమెరికాలోని ప్రయివేటు ఆయుధ సంస్థలు ఊరికే తయారు చేసి నిల్వలు పెట్టుకోవన్న సంగతి తెలిసిందే. పేట్రియాట్ నిల్వలు తరిగిపోతున్న కారణంగా తమకు అమెరికా రక్షణ కల్పించలేదని అర్థం చేసుకున్న గల్ఫ్ దేశాలు ఇరాన్ మీద దాడులు నిలిపివేయాలని వత్తిడి చేస్తున్నాయి. ఈ పరిస్థితిని గమనించే ట్రంప్ సలహాదారులు ఇరాన్‌పై దాడులతో చేతి చమురు వదలటం తప్ప వచ్చేదేమీ లేదని హెచ్చరిస్తున్నారు.

# మేడిగడ్డ తండాలో త్రాగునీటి ఎద్దడి నివారణ కృషి

- సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్
- ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్



**ఆమనగల్లు, ఆగస్టు13 (నేటి దర్శిని);**
అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో ప్రస్తుత నీటి ఎద్దడి నివారణ కోసం కృషి చేయడం జరుగుతుందని సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్,ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ లు అన్నారు. గురువారం మేడిగడ్డ తండాలో నూతనంగా బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మల్లేష్,దేవేందర్, జయందర్,కవిత, మణిపాల్, సితి భాస్కర్, ప్రేమలత హన్మ, గ్రామస్తులు పరమేశ్వర్, పాండు, హరిలాల్, గంగా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో 'ఏకరూప' దుస్తులను పంపిణీ చేసిన సర్పంచ్ వి. శ్రీను నాయక్



**ఆమనగల్లు, ఆగస్టు13(నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని రామ్నుంతల గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ఏకరూప దుస్తులు,షూస్,బెల్ట్ లను పంపిణీ చేశారు.పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు వర్త్యావత్ శ్రీను నాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, కన్న తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలకు అందించే సౌకర్యాలను,వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలోని చదువుకునే చిన్నారులను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్, గ్రామ భీవో కవిత,పాఠశాల ఉపాధ్యాయురాలు సంతోష,గ్రామ ముఖ్య నాయకులు, నరేందర్, మహేష్,శాంతి లాల్,పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ రంగ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి యుఎస్ పి సి నాయకుల మెమోరాండం



**ఆమనగల్లు, ఆగస్టు13 (నేటి దర్శిని);**
ఉపాధ్యాయ రంగంలో నెలకొన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించి, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ యు.ఎస్.పి.సి (టీఎస్ యుటిఎఫ్) నాయకులు ఆమనగల్ తహసిల్దార్ కార్యాలయం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి తహసిల్దార్ ఖాద్రి ద్వారా మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారం, విద్యారంగానికి సంబంధించిన వివిధ సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తే విద్యారంగం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి,సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కులు,సంక్షేమం, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మెమోరాండంలో విజ్ఞప్తి చేసినట్లు నాయకులు తెలిపారు.ఉపాధ్యాయ రంగ సమస్యలపై అందజేసిన ఈ మెమోరాండంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి,త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వ పెద్దలను, అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మణ్, శ్రీనివాసులు,కృష్ణయ్య ,మధుకర్ ,కే.శ్రీనివాసులు, రాంజీ, సరస్వతి, స్వప్న ,యాదగిరి,కిషన్,అహ్మద్,తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సైబర్ భద్రతపై అవగాహన

- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి
- సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం విద్యార్థులకు ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అవగాహన




**మిడ్జిల్, ఆగస్టు13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ విడిసి కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సోషల్ మీడియా, డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతోందని, ఇదే సమయంలో సైబర్ నేరగాళ్లు కూడా కొత్త కొత్త పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.
నకిలీ పెట్టుబడి పథకాలు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసాలు, కొరియర్ ఫ్రాడ్, లోన్ యాప్ మోసాలు, క్యూ ఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.
అధిక లాభాలు వస్తాయని చెప్పే అనుమానాస్పద పెట్టుబడి పథకాలను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టవద్దని తెలిపారు. ఏదైనా సంస్థ, యాప్ లేదా వ్యక్తి ద్వారా పెట్టుబడికి సంబంధించిన ప్రతిపాదన వచ్చినప్పుడు, ఆ సంస్థకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ నిజమైనదేనా, సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా అనే విషయాలను ముందుగా నిర్ధారించుకోవాలని సూచించారు.
అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారిని నమ్మి డబ్బులు చెల్లించవద్దని, లాటరీ, గిఫ్ట్, క్యాష్‌బ్యాక్, కస్టమర్ కేర్ తదితర పేర్లతో వచ్చే అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.
డిజిటల్ అరెస్ట్" పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి పోలీసులు, సీబీఐ, ఈడీ లేదా కోర్టు అధికారులమని పరిచయం చేసుకుని భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.బ్యాంకు ఖాతా నంబర్లు, ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం కార్డు వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని విద్యార్థులకు సూచించారు.సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ గారు సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు.
అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న తాజా విధానాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.కార్యక్రమం ముగింపులో "సురక్షా కా తిరంగా -- స్టే అలెర్ట్ , స్టే అవేర్నెస్ , స్టే సైబర్ సేఫ్ " సందేశంతో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించారు.
ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు


- అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తాం: ఎమ్మెల్యే




**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 13 ( నేటి దర్శిని బ్యూరో):**
ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు. వరంగల్ నగరంలోని హసన్పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని అమిత్ గార్డెన్స్ లో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్లోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని అన్నారు.పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్,ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం,ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు,నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము,55వ డివిజన్ అధ్యక్షులు గడ్డం అరుణ్,56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు,66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,pacs చైర్మెన్ గోపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి,వెంకన్న,కనుపర్తి కిరణ్, రవి యాదవ్, నాయకులు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వెంటనే పూర్తి చేయాలి: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపీ



**ఉమ్మడి వరంగల్ ఆగస్టు 13 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు.వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్ఎస్ వైద్య సేవలపై ఆధారపడుతున్నారని ఎంపీ వివరించారు. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవల కోసం 350 కి.మీ.కు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, తరచూ వైద్య సేవలు అవసరమైన పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తయిందని, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని వివరించారు.పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ డా.విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

WWW.NETIDARSHINI.COM RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# చింతపల్లి మండల అభివృద్ధికి సమష్టి కృషి!

- గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి.. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి
- అధికారులు--ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**చింతపల్లి, ఆగస్టు 13 (నేటి దర్శిని):** చింతపల్లి మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

**గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి!**

ప్రజల సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**రైతు సమస్యలు వెంటనే పరిష్కరించాలి**

రెవెన్యూ శాఖ పరిధిలోని భూ సమస్యలు, భూ రికార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సలహాలు సకాలంలో అందేలా చూడాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి రైతులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

**గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు తదితర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

**ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధి**

గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ**

విద్యార్థుల హాజరు, నాణ్యమైన విద్య, పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.

**ప్రజారోగ్యానికి పెద్దపీట**

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

**విద్యుత్--తాగునీటి సమస్యలకు చెక్**

మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల అధికారులు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి**

మహిళా--శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, ఇతర సంక్షేమ శాఖల అధికారులతో పథకాల అమలుపై సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**"ప్రజలకు మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం"**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం అధికారుల బాధ్యత అన్నారు. చింతపల్లి మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పెండింగ్ సమస్యలను పరిష్కరించి, సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు--సంజీవరెడ్డి, డీఎల్పీవో, ఎంపీడీవో, తహసీల్దార్, మండల ప్రత్యేక అధికారి, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార సేవ

- పేద, అనాథ పిల్లలకు పోషకాహారం అందించిన కృష్ణ గోపాల్ సేవ సమితి సభ్యులు





**ఎల్.బి.నగర్, ఆగస్టు 13 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రెండు ప్రాంతాల్లో అల్పాహార సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాహెబ్ నగర్, వనస్థలిపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సుమారు 600 నుంచి 700 మంది విద్యార్థులకు పోషకమైన అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.అదేవిధంగా పేద, అనాథ పిల్లల పాఠశాలలో సుమారు 300 మంది చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించారు. పోషకాహారం అందించినందుకు విద్యార్థులు సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలవడమే తమ సమితి ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. "మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించవచ్చని తెలిపారు. సంప్రదింపులకు 8106876999 నంబర్‌ను అందుబాటులో ఉంచారు.

## తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి కేతావత్ భీల్యా నాయక్ చేయూత

- భూమిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు.. 50 బస్తాల సిమెంట్ బహూకరణ



**చింతపల్లి, ఆగస్టు 13 (నేటి దర్శిని):** చింతపల్లి మండల పరిధిలోని పాలెంతండాలో నిర్మించనున్న శ్రీశ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ చేయూత అందించారు. ఆలయ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ నిర్మాణానికి 50 బస్తాల సిమెంట్ భూమిపూజ అనంతరం కేతావత్ భీల్యా నాయక్ మాట్లాడుతూ.. తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 50 బస్తాల సిమెంట్‌ను బహూకరిస్తున్నట్లు ప్రకటించారు.ఘనంగా సన్మానం ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన కేతావత్ భీల్యా నాయక్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హరి నాయక్, మోతిరాం నాయక్, నేనావత్ రాము నాయక్, బాలాజీ, పరమేష్, నర్సింహ, భీమ నాయక్, శంకర్, గోపాల్ కుమార్, హరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# కరెంటు గోస(స).. రైతన్నల గుస్సా...

- నాట్లకు ఆటంకం.. పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన
- వేంపాడు సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం, రైతు సంఘం ధర్నా
- అధికారుల నిర్లక్ష్యంతో మోటార్లు కాలిపోతున్నాయని ఆరోపణ
- వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్
- సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం: సీపీఎం




**నిడమనూరు, ఆగస్టు 13 (నేటి దర్శిని):** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం, తెలంగాణ రైతు సంఘం నాయకులు అన్నారు. విద్యుత్ కోతలను నివారించి పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గురువారం నిడమనూరు మండలం వేంపాడు సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ మాట్లాడుతూ.. రైతులు బోరు బావుల ఆధారంగా సాగు చేస్తున్నప్పటికీ, విద్యుత్ కోతల కారణంగా పొలాలకు సకాలంలో నీరు అందడం లేదన్నారు. నారు మడుల్లో నీరు లేకపోవడంతో మొలకలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంటగంటకూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సాగు పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. ఫీడర్ల పరిధిలో సామర్థ్యానికి మించి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వల్ల లోడ్ పెరిగి విద్యుత్ ట్రిప్ అవుతోందని, దీంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని ఆరోపించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు లైన్‌మెన్లు అందుబాటులో ఉండటం లేదని, సబ్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కారణంగా సమస్యలు వెంటనే పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రివేళల్లో రైతులే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసి పంటలను ఎండిపోకుండా కాపాడాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమండ్ల గురువయ్య, వెంపటి మహేష్, మలికంటి చంద్రశేఖర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నడ్డి నాగరాజు, కోదండ చరణ్ రాజు, రైతులు నారబోయిన శంకర్, వెంపటి హనుమంతు, రాగం రామలింగయ్య, వెంపటి సందీప్, పోలగోని నరసింహ, చిలుక అశోక్‌రెడ్డి, కాంసాని దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాయిసన్నిధిలో దేశభక్తి వెల్లువ

- హర్ ఘర్ తిరంగా'కు ఘన మద్దతు.. భక్తులకు జాతీయ జెండాల పంపిణీ!.
- ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి: ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ.



**చింతపల్లి, ఆగస్టు 13 (నేటి దర్శిని):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా సాయిసన్నిధిలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న హారతికి హాజరైన భక్తులందరికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

**ప్రతి ఇంటా.. త్రివర్ణ పతాకం!**

దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి కుటుంబానికి చేరువ చేయాలనే ఉద్దేశంతో భక్తులకు జెండాలను అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ తెలిపారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

**భక్తి.. దేశభక్తి.. ఒకే వేదికపై!**

సాయిసన్నిధిలో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొనడంతో పాటు జాతీయ జెండాలను స్వీకరించి దేశభక్తిని చాటారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది.

# ఆమనగల్లు మున్సిపాలిటీ లో సర్వసభ్య సమావేశం

- మౌలిక వసతుల పనులకు ఆమోదం



**ఆమనగల్లు, ఆగస్టు13 (నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ఎజెండా అంశాలపై చర్చించి, వాటికి ఆమోదం తెలిపారు. ఆమోదించిన ప్రధాన అంశాలు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (యుజిడి) నిర్మాణం మరియు సిసి రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల నిర్వహణ పనులు, మున్సిపల్ కార్యాలయ వాహనాల నిర్వహణ, వనమోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, ఇతర మున్సిపల్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి అదనపు నిధులు తీసుకురావడానికి, నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి తను పూర్తి కట్టుబడి ఉంటానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు (పేజ్ 2) గురించి ప్రస్తావిస్తూ అర్హులైన లబ్ధిదారులందరికీ ఈ పథకాల ఫలాలు అందేలా కౌన్సిల్ సభ్యులు అధికారులు కృషి చేయాలని కసిరెడ్డి సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ వివిధ వీధి దీపాలు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ సమస్యలను అత్యంత త్వరగా పరిష్కరిస్తామని సర్వసభ్య సమావేశంలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ఓ సంద.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మేనేజర్ ఆంజనేయులు, వైస్ చైర్ పర్సన్ గీతా చారి, కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖాదర్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, యాట నరసింహ, ఎంగలి ప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలు,రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి





## మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మిడ్జిల్, ఆగస్టు 13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్ జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించి, సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.గురువారం తహసీల్దార్లతో నిర్వహించిన వెబెక్స్ సమీక్షలో అన్ని మండలాల తహసీల్దార్లతో అక్రమ ఇసుక తవ్వకాలపై, భూభారతి, సదాబైనమా, మీసేవ, ప్రజాపాలన, కుటుంబ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పై, ఆగస్టు 15 న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పై సమగ్రంగా చర్చించారు.ముఖ్యంగా కోయిల్‌కొండ, మూసాపేట, మిడ్జిల్, దేవరకద్ర, చిన్నచింతకుంట, జడ్చర్ల తదితర మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై వచ్చిన ఫిర్యాదులు, నివేదికలను కలెక్టర్ సమీక్షించారు. కోయిల్‌కొండ మండలం శివారం గ్రామంలో ఇసుక తవ్వకాల కారణంగా ప్రభుత్వ భూమికి నష్టం జరిగినట్లు వచ్చిన నివేదికపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.మిడ్జిల్ మండలం లో సీజ్ చేసిన ఇసుక వేలం వెంటనే నిర్వహించాలని మైనింగ్ శాఖా అధికారులను, తహశీల్దారు ఆదేశించారు .క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని సంబంధిత తహసీల్దార్లు స్వయంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని, అక్రమంగా తరలించిన ఇసుక వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిబంధనల ప్రకారం బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. అవసరమైన చోట పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసి, అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మీడియాలో ఇసుక అక్రమ తవ్వకాలకు




సంబంధించి వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు సంబంధిత తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, తీసుకున్న చర్యలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.
ప్రతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పరిస్థితిని స్వయంగా తెలుసుకోవాలని ఆదేశించారు.
అధికారులు ఒకరిపై మరొకరు బాధ్యతలు బదిలీ చేసుకునే పరిస్థితి ఉండకూడదని, తమ పరిధిలో జరుగుతున్న ప్రతి అంశంపై తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయడం, ఇసుకను స్వాధీనం చేసుకోవడం, నష్టాన్ని అంచనా వేసి రికవరీ చర్యలు చేపట్టడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.
ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు,ఇందుకు సంబంధించి తహశీల్దార్లు ప్రతిమండలనుండి 10 నుండి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ జాబితాను వెంటనే పంపాలని అన్నారు.
అనంతరం జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష నిర్వహించారు. టూ–బీహెచ్‌కే గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి, పెండింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్–1 జాబితాలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు.
ప్రజాపాలన పోర్టల్‌లోని దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుని అర్హులను ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు. గృహాల కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్గాల వారీ రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.పెండింగ్‌లో ఉన్న గృహాల ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పరిష్కరించి, గృహాల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, కుటుంబ రిజిస్ట్రేషన్ల పై తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు.సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కుటుంబ రిజిస్ట్రేషన్లకు సంబంధించి దరఖాస్తు లను కూడా వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఐతే చనిపోయిన వారి వివరణను జాగ్రత్తగా పరిశీలించి కుటుంబ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను జారీ చేయాలని అన్నారు.
ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, డి. ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్. డి.ఓ నవీన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్
ఏ. డి అశోక్, జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, మండల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాత గీతం ఆవిష్కరణ చేసిన కలెక్టర్



**మిడ్జిల్, ఆగస్టు 13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
భావి భారత పౌరులు విద్యార్థులకు భరతమాత గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాతగీతాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. రాబోయే భవిష్యత్ తరాలకు ఇది చాలా ఆదర్శంగా ఉంటుందని భావి భారత పౌరులైన విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని, నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ గీతం ఉందని కలెక్టర్ గేయ రచయితని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్ ,కవి, రచయిత, ఎం ఎన్ విజయకుమార్ ,స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నల్ల ప్రసాద్

- ఎంఆర్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం
- చింతపల్లి గ్రామానికి చెందిన నల్ల ప్రసాద్‌కు అభినందనల వెల్లువ



**చింతపల్లి, ఆగస్టు 13 (నేటి దర్శిని):**
చింతపల్లి గ్రామానికి చెందిన నల్ల ప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నియమితులైన సందర్భంగా ఎంఆర్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.
ఈ నెల 9న నల్గొండలో నిర్వహించిన బీఎస్పీ జిల్లా సమీక్ష సమావేశంలో నల్ల ప్రసాద్‌ను బీఎస్పీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.
సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నల్ల ప్రసాద్‌కు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. చింతపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి బీఎస్పీలో కీలక బాధ్యత లభించడం అభినందనీయమన్నారు.
ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎర్ర జగన్, ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చెన్నయ్య, మాజీ చింతపల్లి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర వెంకటయ్య, సమాచార ప్రచార సమితి అధ్యక్షులు ఏనుగుల వెంకటయ్య, రాములు, నల్ల ఆంజనేయులు, మొగులయ్య, సురేష్, శ్రీను, కుమార్, జగన్, నాగయ్య, కళ్యాణ్, యాదగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ

- సర్పంచ్ చేతుల మీదుగా బట్టలు అందజేత

**గోపాల్‌పేట ఆగస్టు (13) (నేటి దర్శిని):**
ఏదుల మండలం రేకులపల్లి తండాలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది.తండా సర్పంచ్ కె. ప్రభాకర్ నాయక్,ఉప సర్పంచ్ ఎం లలిత చేతుల మీదుగా చిన్నారులకు యూనిఫామ్స్ అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తండాలోని చిన్నారులను అంగన్వాడీ కేంద్రానికి పంపాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువుతో పాటు ఆటలు, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం ఎం. మేర్యారెడ్డి అంగన్వాడీ నిర్వాహకురాలు కె చిట్టమ్మ వార్డు సభ్యులు కె. బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంతక్రియలు నిర్వర్తించిన కార్పొరేటర్

- మానవత్వాన్ని చాటుకున్న కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్

**నల్గొండ, ఆగస్టు 13 (నేటి దర్శిని):**
అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్. నల్లగొండ పట్టణంలోని పెద్దబండ 20వ డివిజన్ కు చెందిన శాంతి అనాధల వృద్ధాశ్రమం లో, మునుగోడు మండలం ఎట్లెల్లి గ్రామానికి చెందిన కడారి ఎల్లమ్మ తనకు ఎవరూ లేకపోవడంతో గత ఐదేళ్ల నుంచి శాంతి వృద్ధాశ్రమంలో ఉంటుంది. గురువారం తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందింది. ఇట్టి విషయాన్ని శాంతి మహిళా వృద్ధాశ్రమం నిర్వాహకురాలు పిచ్చమ్మ, 20వ డివిజన్ కార్పొరేటర్




అల్లి సుభాష్ యాదవ్ కు తెలియజేయగా, దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు


## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం




అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# మహాదేవిగా కామాక్షి భాస్కర్ల సరికొత్త సాహసం..


## ఎం.ఎస్. రాజు 'అగధ'పై భారీ అంచనాలు!




టాలీవుడ్ తెరపై ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాల హవా జోరుగా సాగుతోంది. ఒకప్పుడు గ్లామర్ పాత్రలకే పరిమితమైన కథానాయికలు, ఇప్పుడు బలమైన కథలను తమ భుజాలపై మోస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నారు. అరుంధతి చిత్రంతో అనుష్క శెట్టి వేసిన బలమైన ముద్ర నుంచి, ఇటీవలి కాలంలో సమంత 'మా ఇంటి బంగారం', రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్', నివేదా థామస్ '35' వంటి వైవిధ్యమైన చిత్రాల వరకు మహిళా ప్రధాన కథలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అయితే ఈ ట్రెండ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఇప్పుడు మరో ప్రతిభావంతురాలైన నటి సిద్ధమయ్యారు. 'పొలిమేర' చిత్రాలతో నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న టెర్రిఫిక్ ఆర్టిస్ట్ కామాక్షి భాస్కర్ల , ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సంచలన చిత్రం 'అగధ' తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆగస్టు 14న ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల 'మహాదేవి' అనే అత్యంత శక్తివంతమైన, విభిన్నమైన ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'అగధ' టీజర్, ట్రైలర్‌లు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఇప్పటివరకు కామాక్షి చేసిన సినిమాలకు, పాత్రలకు పూర్తి భిన్నంగా ఈ చిత్రం ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. కేవలం నటనకు మాత్రమే కాకుండా, కథలో ప్రాధాన్యమున్న యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆమె స్వయంగా నటించడం ఈ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఒక మహిళా ప్రధాన కథాంశంతో వస్తున్న ఈ సినిమా కామాక్షి కెరీర్‌లో మైలురాయిగా నిలవడమే కాకుండా, టాలీవుడ్‌లో ఉమెన్ సెంట్రిక్ సినిమాల విజయ పరంపరను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. విభిన్నమైన భావోద్వేగాలను పండిస్తూ, ఒక కొత్త సినిమాటిక్ అనుభూతిని పంచడానికి సిద్ధమైన 'అగధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మహాదేవిగా కామాక్షి భాస్కర్ల అద్భుత నటనను చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తారక్ లేకున్నా ఆగని డ్రాగన్' షూటింగ్..

## -వచ్చే నెల నుంచి నయా షెడ్యూల్ షురూ!



టాలీవుడ్ అగ్ర కథనాయకుడు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' షూటింగ్‌కు సంబంధించి ఒక లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. ఇటీవలే ఎన్టీఆర్ సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో, ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ 3 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.భూజానికి జరిగిన సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ, సినిమా షూటింగ్‌లో ఎలాంటి బ్రేక్ ఉండకూడదని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి మొదలయ్యే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తో పాటు చిన్ననాటి సన్నివేశాలను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్నారు. తారక్‌కు సంబంధం లేని ఈ బ్యాలెన్స్ పోర్షన్‌ల షూటింగ్ పూర్తయిన తర్వాత, సెప్టెంబర్ మూడో వారం తర్వాత ఎన్టీఆర్ స్వయంగా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. మరోవైపు, ఎన్టీఆర్ గాయం కారణంగా ఈ సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తమని తెలుస్తుంది. దీనిపై కూడా మేకర్స్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.


# రెడ్ డ్రెస్ లో మెరిసిపోతున్న రకుల్



రకుల్ ప్రీత్ సింగ్ గురించి, ఆమె అందం గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు, భారీ ఫాలోయింగ్ ను సొంతం చేసుకున్న రకుల్, ప్రస్తుతం బాలీవుడ్ కు వెళ్లి అక్కడే సెటిలైపోయింది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలను నెట్టింట షేర్ చేస్తూ, ఫాలోవర్లకు టచ్ లో ఉండే రకుల్ తాజాగా ట్రెండీ లుక్ లో దర్శనమిచ్చింది. ఈ ఫోటోల్లో రకుల్ రెడ్ కలర్ షోల్డర్ లెస్ కాలమ్ ఫ్రాక్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఈ డ్రెస్ లో రకుల్ ను, ఆమె అందాలను చూసి కుర్రాళ్లు ఫిదా అయిపోయి, వాటిని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

# మొదటి సినిమాతోనే రూ.58 కోట్లు..

## బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న లోకేష్ కనగరాజ్ 'డీసీ'!



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365